ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-2, (April-June), 2025

# ఆధునిక కవిత్వం- కవి సంఘాలు- సంస్కరణ దృష్టి

**డా.తంగి ఓగేశ్వర రావు**

తెలుగు అధ్యాపకులు,వి వి గిరి ప్రభుత్వ కళాశాల, దుంపగడప

పశ్చిమ గోదావరి జిల్లా ,మొబైల్ నెం : 9959753832

మెయిల్ : t.ogeswararao@gmail.com

\

Article Received: 18/04/2025 Article Accepted: 15/06/2025

Published Online: 18/06/2025 DOI:10.53414/Sahithyatharangini.2025.2265

***విషయసంగ్రహం :***

*తెలుగులో 19వ శతాబ్ది ద్వితీయార్ధం నుండి అంతకు పూర్వంతో పోలిస్తే భిన్నమైన సాహిత్యం వెలువడింది. ఈ భిన్నత్వం ప్రధానంగా భాషలోనూ, కవితా వస్తువులోనూ, ఇతివృత్తంలోనూ, పాత్రల చిత్రణలోనూ గమనించవచ్చు. గ్రాంథికం స్థానంలో వ్యవహారికం, పద్యకవిత్వం స్థానంలో వచనకవిత్వం ముందుకువచ్చాయి. ఈ కాలంలో కవులు సామాన్య ప్రజల జీవితాలు ఇతివృత్తాలుగా తీసుకొని, మన చుట్టూ కనిపించే వ్యక్తులనే పాత్రలుగా చేసి కవిత్వం రాశారు. దీనినే ఆధునిక కవిత్వం అంటారు. ఇది ఆంగ్లసాహిత్య ప్రభావం వలన తెలుగులోనికి వచ్చిన నూతన ప్రక్రియగా చెప్పవచ్చు. ఈ ఆధునిక కవిత్వంలో భావకవిత్వం, అభ్యుదయకవిత్వం మొదలైన విభిన్న ప్రక్రియలు ఉన్నాయి. ఆయా ప్రక్రియల అభివృద్ధికిగానూ ఆయా కవులు సంఘాలుగా ఏర్పడటం జరిగింది. ఈ కాలంలో సాహిత్య లక్ష్యం కూడా ధనికులు, పాలకులను సంతోషపెట్టడం కాకుండా సమాజంలో రుగ్మతలను తొలిగించడంగా కనిపిస్తుంది. ఆధునిక కవిత్వ ఆవిర్భావం, వికాసంతోపాటూ, కవిత్వ సంఘాలు, వాటి లక్ష్యాలు, ఆ సంఘాల ద్వారా వెలువడిన సాహిత్యం సామాజిక సంస్కరణకు దోహదం చేసిన విధానాన్ని విశ్లేషణాత్మకంగా వివరించడం ఈ పరిశోధనా పత్రం లక్ష్యం. దీనికి అవసరమైన సమాచారాన్ని కళాశాల గ్రంథాలయం నుండి, అంతర్జాలం నుండి స్వీకరించడం జరిగింది.*

**కీలకపదాలు:** ఆధునిక కవిత్వం, భావకవిత్వం, అభ్యుదయకవిత్వం, పద్యం, వచనం

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-2, (April-June), 2025

**ఉపోద్ఘాతం:**

కవికానీ, సాహిత్యకారుడుకానీ, కళాకారుడుకానీ స్వభావసిద్ధంగా ప్రగతిశీలిగానే ఉంటాడు. ఒకవేళ ఈ స్వభావం లేకపోతే అసలు సాహిత్యకారుడు కానేరడు. ప్రగతిశీల భావంతో సమాజంలోని సమస్యల పరిష్కారానికి దోహదం చేసే కవిత్వమే ఆధునిక కవిత్వం. ఈ ఆధునికయుగంలో సామాజిక ప్రయోజనం ఆశించి, సమస్యలకు పరిష్కారాన్ని శాస్త్రీయదృష్టితో చూపుతూ సాహిత్య నిర్మాణం చేయగలవారు బహుకొద్దిమంది మాత్రమే కనిపిస్తారు.

ఆధునిక సాహిత్యాన్ని అధ్యయనం చేసేటప్పుడు రూపం, వస్తువు, భావం, రచన - ఈ నాలుగింటిలో కనీసం ఏ ఒక్కటైనా తత్పూర్వ సాహిత్యం కంటే ఏ రకంగా భిన్నమైనది? ఏ మేరకు ఆధునికత ఉన్నది? అనే అవగాహన ఉండాలి. ఎందుకంటే నవ్య కవితా ధోరణులు విపరీతంగా పుడుతున్నాయి. దీనికి కారణం ఒకరి కవిత్వం కంటే మరొకరు భిన్నమైన కవిత్వం రాయాలనే జిజ్ఞాస, ఉత్సాహం కవితా సమాజంలో వ్యాపించడమే. దీనిని మనం తప్పక హర్షించాలి.

ప్రతీకవాదం, పేరడీ గేయాలు, నగర జీవితచిత్రణ, ముక్తక గేయాలు, అధిక్షేపక గేయాలు, గేయనాటికలు, నాటకాలు, అభ్యుదయ గేయ నాటికలు, ప్రణయ గేయాలు, బాలగేయాలు, సమర గేయాలు, ప్రచార గేయాలు, విచిత్ర పోకడలతో సినిమా పాటలు ఇవన్నీ కూడా నవ్య మరియు అతినవ్యం కవితా ధోరణులతో పుట్టుకొచ్చాయి. ఇంకా నవ్య కవితా ధోరణులు పుడుతూనే ఉన్నాయి.

"పాతకాలం పద్యమైతే
వర్తమానం వచన గేయం"[1]

అంటారు కుందుర్తి ఆంజనేయులు. పద్యాలు పోయి కేవలం వచనంలో కవిత్వం చెప్పే పద్ధతి వచ్చేటప్పటికి కవులు భావ వ్యక్తీకరణకు చిత్ర విచిత్రమైన కవితా ధోరణులను ఎన్నుకొంటున్నారు. అయితే "నవ్య కవిత్వ మన్నది ఒక్క బాట, ఒక్కనాడు, ఒక్క వ్యక్తి సృజించినదాన్ని అనుసరించి వర్ధిల్లలేదు. వర్షము పడినపుడు సెలయేళ్లు కలిస్తే నదియైనట్లు వ్యక్తులు, ఉద్యమాలు పరిస్థితులు కలిసి రావడంవల్ల నవ్య కవిత్వం నాలుగుచోట్లా పుట్టి పెరిగింది"[2] అని నవకవిత్వ ఆవిర్భావం గురించి చెప్పారు శ్రీపాద గోపాల కృష్ణమూర్తిగారు.

ఈ నవ్య కవిత్వంలో ఎన్నో భిన్న రీతులను భిన్న ఉద్యమాలుగా సృష్టించి, విభాగించి పరిశీలన, పరిశోధనా సౌలభ్యంకోసం ఏర్పాటుచేసుకొన్నా ముఖ్యమైన ధోరణులు రెండే కన్పిస్తున్నాయి. ఈ విషయాన్ని

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-2, (April-June), 2025

సి. నారాయణరెడ్డిగారు "ఈ నవ్య కవిత్వంలో తాలోత్తాలమైన ఉద్యమములు రెండేరెండు. ఒకటి భావ కవిత్వము, రెండవది అభ్యుదయ కవిత్వము"[3] అని రెండు ముఖ్యభాగాలుగా విభాగించారు. మిగిలిన కవితా ధోరణులు, ఉద్యమాలు ఈ రెండింటి అంతర్భాగాలుగా చెప్పడం జరిగింది.

చాలావరకు నవ్యకవులు పాత్రల చిత్రీకరణకు, అంగవర్ణనకన్నా అంతరంగ వర్ణనకే ప్రాధాన్యత నిచ్చారు. ఈ అంతరంగ వర్ణన రానురాను అంతరంగ సంస్కరణకు దారితీసింది. అందుకే

"కవులు సంస్కరణను గైసేతురుంగాక
పాలకులును నీతి బరుగుగాక,
యవని భారతాంబ యాదర్శ మౌగాక,
సాధులోక పాల సత్యశీల"[4]

అని కొంతమంది కవులు, తమ తోటి కవులకు, పరిపాలకులకు కర్తవ్య నిర్దేశం చేశారు. ఈ నిర్దేశం సంస్కరణకు దారితీసింది.

**పూర్వ సాహిత్య బాంధవ్యం :**

ఎవరైనా నవ్య సాహిత్యంలో నవ్యతలేదంటే ఎలా అంగీకరించరో అలాగే దానికి పూర్వ సాహిత్య బాంధవ్యం లేదంటే కూడా అంగీకరించరు. నవ్యసాహిత్యం సృష్టించిన సాహితీపరులు సంస్కృతాంధ్ర సాహిత్యాలలో పుట్టి పెరిగినవారు. పాశ్చాత్య సంప్రదాయాలు, దేశంలో ఇతర ప్రాంతాలలో అవతరించిన నవ్యపైఖరులు జీర్ణించుకొని పుష్టి సంపాదించుకొన్నవారు. కొత్తపాతల మేలుకలయికతో వింతశోభ సమకూర్చు కొన్నవారు. సాటి వాతావరణం అతనిని నవ కవిని చేసింది. సాటి సామాజకులకోసం, పాఠకుల కోసం ఉద్దేశించి అతడు రచన చేశాడు. తర్వాత ఈరకమైన రచనలు చేసిన కవులు ముఖ్యంగా ఆంధ్ర దేశంలో ఎక్కువగా ఉన్నారు. దీనికి "I can confidently assert that in Andhra Pradesh there are more poets per square kilometer than anywhere else in the whole of India"[5] అన్న శ్రీశ్రీ మాటలను గుర్తు చేసుకొనవలసి ఉన్నది.

**కందుకూరి వీరేశలింగం పంతులు గారు :**

ఇదివరకు చెప్పినట్లుగా ఒక్కసారిగా ఈ నవ్యకవిత్వం ఆవిర్భవించలేదు. తెలుగులో ఆధునిక యుగ ప్రవర్తకులుగా చెప్పబడుచున్న కందుకూరి వీరేశలింగం పంతులుగారు సంప్రదాయాన్ని మన్నించిన వారే. కానీ

ఆనాటి సాహిత్యంలో ప్రచురంగాలేని కొన్ని క్రొత్త పోకడల్ని ప్రవేశపెట్టాలనీ అదేవిధంగా కొన్ని పనికిమాలిన పోకడల్ని మార్చాలనే దృఢమైన సంకల్పం కలవారు. వీరు తమ 'సరస్వతీ నారద సంవాదము' అనే రచన ద్వారా తన కాలం కవిత్వంలో ఉన్న వ్యర్థ పదాడంబరాన్ని నిరసించారు. అంటే వీరేశలింగం పంతులు గారు సంప్రదాయక కవిత్వంలో ఆధునికతను ప్రవేశపెట్టి నవ్య సంప్రదాయ కవిత్వానికి నాంది పలికారని అర్థం.

ఆనాడు బ్రిటీషు పాలనలో మనవారు ఇంగ్లండులో బయలుదేరుతున్న కవితోద్యమాలకు దీటుగా, సామ్యంగా భావకవిత్వం, ప్రతీకవాదం (సింబాలిజమ్), ఇమేజిజమ్, డాడాయిజం, అధివాస్తవికత (సర్రియలిజమ్), అభ్యుదయ కవిత్వం మొదలైన ఎన్నో ధోరణులను ప్రారంభించి రచనలు విరివిగా చేశారు.

**ఆధునిక కవిత్వం- ఛందస్సు :**

ఈ ఆధునిక కవితా సృష్టిలో మొదట ఆలోచించవలసింది ప్రాచీన సంప్రదాయమైన ఛందస్సు గురించి, "ఛందస్సు కవిత్వానికి తప్పనిసరి నియమం కాకపోయినా కవితా సౌందర్యాన్ని అది ఇనుమడింపచేస్తుందనేది నిజం. కాని కవిత్వానికి ఛందస్సు అక్కరలేదనే అభిప్రాయం మాత్రం పునఃపునరాలోచించవలసిందిగానే అనిపిస్తుంది"[6] అని కోవెల సంపత్కుమారాచార్యగారు అన్న మాటలను పరిశీలిస్తే కవిత్వానికి ఛందస్సు ఆవశ్యకత అర్థమవుతుంది. కవిత్వంలో అక్షర ఛందస్సును వాడాలా, మాత్రాఛందస్సు వాడాలా లేక రెండింటికీ భిన్నమైన గేయ ఛందస్సునా అనేది కవినిబట్టి, సందర్భాన్నిబట్టి, కవితా వస్తువునుబట్టి ఉంటుంది.

సాహిత్యం ఛందస్సహితంగానూ (verse), ఛందోరహితంగానూ (prose) ఉంటుంది. ఛందస్సహిత సాహిత్యాన్ని పద (గేయ), పద్యసాహిత్యాలని స్థూలంగా విభజించవచ్చు. గేయం, పదం, గీతం, పాట అన్న పదాలు సామాన్య వ్యవహారంలో సమానార్థకాలుగానే చెలామణీ అవుతున్నాయి. "కొందరు విమర్శకులు ఒక్కొక్క దానిని పరిమిత పరిధిలో పారిభాషికార్థంలో వాడుతున్నారు. గేయం అంటే మాత్రాఛందస్సులో రాసిన కవిత్వమని, 'పాట' అంటే రాగ తాళాలతో పాడే సంగీతరచన అనీ సాహిత్యలోకంలో రూఢమైంది"[7] అంటారు చెన్నకేశవరెడ్డి.

"ఛందస్సు ఏదైనా సామాజిక స్పృహ ముఖ్యం. మాత్రా ఛందస్సుల్లోనే మళ్లీ రామాయణం రాస్తే అది ఆధునిక కవిత్వం అనిపించుకోదు"[8] కాబట్టి కవి ప్రస్తుత సమాజంలోని సమకాలీన సమస్యలను తీసుకొని

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-2, (April-June), 2025

ప్రజాశ్రేయస్సు దృష్ట్యా, ప్రగతిశీల భావంతో, సమాజ సంస్కరణాధ్యేయంతో, అభ్యుదయ దృష్టితో చేసే కవిత్వమే ఆధునిక కవిత్వం.

అయితే ఇటీవల కాలంలో పద్య ఛందస్సులో కూడా సమకాలీన సమస్యల చిత్రీకరణ జరుగుతూ ఉంది. దీనిని సంస్కరణ దృష్టితోను, అభ్యుదయ దృష్టితోను స్వీకరించవలసి ఉంది. ఇక్కడ కవి దృష్టి ఛందస్సు కాదు. కేవలం ఉపదేశ దృష్టి. ఇటువంటి రచనలు నేడు కొన్ని దర్శనమిస్తున్నాయి. దీనికి కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళె వంటి కవుల రచనలు మంచి ఉదాహరణ.

**సంప్రదాయాలు :**

"సంప్రదాయాల విషయానికొస్తే, సంప్రదాయాలు కూడా మారుతూనే ఉంటాయి. 'సహగమనం' ఒకప్పుడు గొప్పసంప్రదాయం. దాన్ని సమర్థించాలా? వ్యతిరేకించాలా? ఇలాగే 'విడాకులు' ఆధునిక సంప్రదాయం. దీన్ని ఒప్పుకొనేవారూ ఉన్నారు. తప్పు అనేవారూ ఉన్నారు. దారిద్ర్యం పూర్వకర్మ ఫలితం అనేవారున్నారు. అందుకు అంగీకరించరు మార్క్సిస్టులు. అందుచేతనే పాత సంప్రదాయాలమీద తిరుగుబాటు ఆధునిక కవిత్వం"[9] అని శ్రీశ్రీ అంటారు.

గురజాడ, శ్రీశ్రీ లాంటి మహాకవులు కొంతమంది సరళముల్లైన సామాన్యముల్లైన పదాలతో సరళమైన గేయ ఛందస్సుతో కవిత్వాన్ని రాయడంవల్లనే ఎంతోమంది యువకవుల గళాలనుండి కలాల నుండి కవిత్వం వెలువడి సామాజిక సమస్యలను, వాటి నివారణలను చూపగలిగింది. ఇది ఆధునిక కవిత్వానికి పట్టిన ఒక క్రొత్త శోభ.

ఆధునిక కవిత్వాన్ని రచించడానికి, పోషించడానికి, ప్రోత్సహించడానికి, నవ్య కవిత్వాభివృద్ధిని పరిశీలించడానికి, పరిశోధించడానికి, ఈ కవిత్వానికి సంఘంలో గౌరవం కల్పించడానికి, ప్రజలలో విజ్ఞానం కలిగించి, దానిని వ్యాపింప చేయడానికి ఎన్నో నవ్య సాహిత్య పరిషత్తులు, సంఘాలు ప్రారంభమయ్యాయి. ఇవి తమ కార్యాచరణలో చాలా వరకు సఫలీకృతమయ్యాయి.

**వచన గేయ కవితావికాసం :**

ఇక స్వాతంత్ర్యానంతర కవిత్వమంటే స్థూలంగా శ్రీశ్రీ యుగంలోని కవితా వికాసమని చెప్పుకోవచ్చు. శ్రీశ్రీ యుగం మొత్తం మీద చూస్తే ప్రయోజనవాదమే బలీయమైనట్లు కనిపిస్తున్నది. ఈ కాలంలో ప్రయోజన

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-2, (April-June), 2025

వాదం నెగ్గింది. కనుకనే భాషలో వ్యవహారికవాదం నెగ్గింది. భావంలో అభ్యుదయ వాదం నెగ్గింది. అందువల్ల స్వాతంత్ర్యానంతర కవిత్వమంటే వచన గేయ కవితా వికాసమన్నమాట.

"1976 జనవరి 26వ తేదీన అఖిల భారత తెలుగు రచయితల సంఘం వారు రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో కలలో కూడా ఊహించని విధంగా ప్రసిద్ధులైన కొందరు పద్యకవులు వచన కవితలు గానం చేశారు. శ్రీయుతులు ముదిగొండ వీరభద్రమూర్తిగారు, వానమామలై వరదాచార్యులు గారు, శ్రీ సి.వి. సుబ్బన్న శతావధానిగారు వచన కవితలు చదవడం నాకు, ప్రేక్షకులకు ఎంతో ఆశ్చర్యం వేసింది"[10] అంటారు కుందుర్తి. దీనినిబట్టి వచన కవితా రచనం, పఠనం, ప్రచారం విరివిగా సాగినట్లు బోధపడుతుంది. వచనకవులు, పద్యకవులు కూడా వచన గేయ కవితా రచన చేశారు.

**ప్రజా కవులు :**

తెలుగు కవిత్వంలో కొందరిని ప్రజా కవులుగా చెప్పవలసి ఉండి. కారణం ప్రజాకవుల ప్రధాన లక్షణం వారు పుస్తకాలు ప్రకటించి ఊరుకోరు. ప్రజల దగ్గరకు వెళ్లి కవిత్వం వినిపిస్తారు. ఇటువంటి వారు తెలుగు సాహిత్యంలో ఎంతోమంది ఉన్నారు. వారిలో సుంకర, వాసిరెడ్డి, గద్దర్ మొదలైన వారిని ప్రధానంగా పేర్కొనవచ్చు. మనకు తెలిసిన ప్రజాకవి వేమన ప్రజల దగ్గరకు వెళ్ళి, ప్రజలలో తిరుగుతూ వారి సమస్యలను అర్థం చేసుకొని, వాటి పరిష్కారాలను తన బోధనల ద్వారా (ఆటవెలది పద్యాల ద్వారా) తెలియజేశారు. అందుకే వేమన మొదటి ప్రజాకవి అయ్యారు.

సాహితీవేత్తలను మూడు రకాలుగా విభజింపవచ్చు. "మేము సమాజాన్ని వాస్తవిక దృష్టితో చూస్తాము. సమాజంలోని మంచి చెడు రెండింటిని దర్పణం పడతాము అంటారు మొదటిదిరకం సాహితీవేత్తలు. సాహిత్యం ఎప్పుడు సామాజిక స్థితిగతులను చిత్రిస్తుంది కాని సమస్యాపూర్వకమైన పరిష్కారం చూపాల్సిన బాధ్యత మాకు లేదు అంటారు రెండోరకపు సాహితీపరులు. వాస్తవాన్ని చూపిస్తూనే సమస్యల పరిష్కారానికి ఇలా చెయ్యాలని ఒక పాత్రద్వారా చెప్పిస్తారు మూడో వర్గపు సాహితీవేత్తలు. ఇక్కడ సమస్యా పరిష్కారం జరుగుతుంది"[11] అని కవుల దృష్టిని వివరిస్తారు మల్లాది సుబ్బమ్మగారు.

ఇంచుమించుగ క్రీ.శ. 1900 నుండి స్వాతంత్ర్యం సిద్ధించేవరకు భావకవిత్వం సుమారు నాలుగైదు దశాబ్దాలు తెలుగు కవిత్వంలో బాగా చోటుచేసుకుంది. తర్వాత ఈ భావకవిత్వం చురుకుగా ప్రచారంలో

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-2, (April-June), 2025

ఉండగానే దీనిపై తిరుగుబాటుగా వచ్చిన కవిత్వమే అభ్యుదయ కవిత్వం. భారత జాతీయైక్యత వీరి ప్రధాన ధ్యేయం. ఇతర భాషలలోని అభ్యుదయ కవిత్వాన్ని కూడా మనకందించడం జరిగింది.

**భావ కవిత్వం :**

"భావ కవులు సమాజావరణం నుంచి వెలివేయబడ్డట్టుగా భావించుకుంటూ, స్వగతాన్ని ఆదరించి, సామాజిక బాధ్యతలను విస్మరించి పలాయన వాదులవుతున్నారన్న అపవాదుకు లోనయ్యారు"[12] అనేది కొంతవరకు సత్యం. వెనుదిరిగి చూచుకుంటే ఈ నూతన కవిత్వోద్యమానికి ఇంగ్లండులో 19వ శతాబ్దారంభంలో వచ్చిన 'రొమాంటిక్' కవితోద్యమానికి కొంత సామ్యమే కాక దీనిపై దాని ప్రభావం కూడా కనపడుతుంది. వీరు కొత్త కవితారూపాలను, ఛందస్సులను, లయలను కవిత్వంలోకి ప్రవేశపెట్టారు.

"అటు ఆంగ్లకవుల ప్రభావం, ఇటు రవీంద్రనాథ ఠాకూరు ప్రభావం యీ రెండూ కలిసి మనకు తెలుగులో 'భావకవిత్వం' రూపురేఖలు దిద్దుకొన్నది"[13] అనే అభిప్రాయం కూడా ఉంది.

**ఖండకావ్యం :**

ఆధునిక సాహిత్యం వివిధ ప్రక్రియా విలసితమై వికసిస్తూ ఉంది. ఇలాంటి ప్రక్రియలలో ఖండకావ్యం ఒకటి. ఇది నవ్య కవిత్వంలో ప్రథమగణ్యమైన ప్రక్రియ. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగు సాహిత్య కేదారంలో వెల్లివిరిసిన సాహిత్యశాఖ. అలాగని ఈ ఖండకావ్యం మన తెలుగు సాహిత్యానికి కొత్తేమీకాదు. ప్రాచీన లాక్షణికులైన ఆనందవర్ధనుడు, భామహుడు, విశ్వనాథుడు ఈ ఖండ కావ్యాన్ని గూర్చి చర్చించారు.

ఖండకావ్య వికాసానికి భారత స్వాతంత్ర్య సమరం అధిక దోహదం చేసింది. స్వాతంత్ర్యోద్యమం దేశం నలుచెరగులా వ్యాపించడంలో ఖండకావ్యాల పాత్ర ప్రముఖమయింది.

దీనిని గురించి "స్వీయానుభూతి అన్యాపదేశంగానూ, లేదా ఆత్మపరంగానూ ఉంటూ నాతి దీర్ఘాలైన పద్యగేయ రచనలను ఖండకావ్యాలక్రింద లెక్కించవచ్చు"[14] అంటారు సాహితీవేత్తలు,

**అభ్యుదయ కవిత్వం :**

తెలుగుదేశంలోని అభ్యుదయ కవిత్వం సమకాలీనమైన ఒకానొక సాంఘిక చైతన్యాన్ని రాజకీయోద్యమాన్ని ఆధారం చేసుకొని ప్రవర్ధమానమయింది. దీనికి వర్గ సంఘర్షణ సిద్ధాంతం మూలం. దీని ప్రయోక్త 'కారల్ మార్క్స్'.

చాలా కాలం సాహిత్యం, కళలు ధనిక, పండిత వర్గాల చేతుల్లోపడి నలుగుతూ వచ్చాయి. ఈ విధానాన్ని సంస్కరించి, ప్రజలకు సన్నిహితంచేసి, జీవిత వాస్తవాలను చిత్రించే ఉద్దేశంతో భవిష్యత్తుకు మార్గదర్శకులుగా కవిత్వాన్ని వ్రాసే ఉద్దేశంతో ఈ అభ్యుదయ కవులు వచ్చారు. సమాజంలో ఉండే ఆకలి, దరిద్రం, సాంఘిక అసమానత, రాజకీయ పరాధీనతలాంటి సమస్యలమీద కొత్త రచనలు చేశారు.

ఈ అభ్యుదయ కవిత్వంలో భాగంగానే 1970లో శ్రీశ్రీ అధ్యక్షతన 'విప్లవ రచయితల సంఘం (విరసం)' ఆవిర్భవించింది. ఈ కవులు 'మార్క్సిజం', 'లెనినిజం' మార్గాన్ని అనుసరించారు. 1950 నుండి అభ్యుదయ కవితాయుగంగా చెప్పుకుంటే 1970 నుండి విప్లవ కవితాయుగం మొదలైందనవచ్చు. వీరి లక్ష్యసాధనలో విమర్శింపబడిన వర్గం వీరికి ఎర్రముద్ర తగిలించింది. వీరు పలు విమర్శలకు గురియై ప్రభుత్వ వ్యతిరేకులుగా కూడా కష్టాలు పడ్డారు.

**మానవతా వాదం :**

బ్రిటీషుదేశంలో 18వ శతాబ్ది నుండే వ్యాప్తిలో ఉన్న మానవతావాదం (హ్యూమనిజం) మన సాహిత్యంలో కూడా ప్రవేశించింది. 'మానవతావాదం' అంటే మానవునికి సంబంధించిన తత్త్వశాస్త్రమని, మానవుడినే కేంద్రంగా భావించే ఉత్తమాదర్శ మని చెప్పవచ్చు.

"మానవ సంక్షేమాన్ని, మానవ ప్రగతిని, మానవ వ్యవస్థని, మానవుడు మానవుని గురించి శుభకామనతో చేసే ఆలోచనా సరళిని మానవతావాదంగా పరిగణింపవచ్చు"[15] అనేది ఒక భావం.

కవులందరు సామాన్యంగా మానవజాతి సంస్కర్తలుగా, మానవ శ్రేయోభిలాషులుగా ఉంటారు. ఆధునిక తెలుగు కవిత్వంలో మానవతావాద విభిన్న ధోరణులు మనకు స్పష్టంగా కనిపిస్తాయి.

"చీకటీ, దుఃఖం, కరువు కాటకం
లేని దేశం ఎక్కడుంది?
సదా అమృతం, వెల్తురూ వున్న
రమ్య బృందావనం ఎక్కడుంది"[16]

అంటూ కవి మానవత కోసం ఆశావాదాన్ని అనుసరిస్తారు.

**అధివాస్తవికత (సర్రియలిజం) :**మానవునికి మానసికంగా ఎన్నో శృంఖలాలు ఉన్నాయి. వాటినిబట్టే ఊహలు కూడా సంకుచితంగా ఉంటాయి. అందుచేత శృంఖలాలను బ్రద్దలుకొట్టడానికి షాక్ నిచ్చే రచనలు కావాలి. అదే

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-2, (April-June), 2025

అధివాస్తవికత. "మేము విప్లవం సృష్టించడానికే నిర్ణయింపబడినాం, మేము 'అధివాస్తవికత' అనే మాటను 'విప్లవం' అనే మాటను సమానంగా పేర్కొంటాం"[17] అంటారు అధివాస్తవిక రచయితలు. 'మాకు సాహిత్యంతో పనిలేదుకాని మేమూ సాహిత్యాన్ని ఉపయోగించుకోవడానికి వెనుకాడం' అని వీరు తరచుగా పేర్కొంటారు. "సర్రియలిజం ఒక కవితాత్మక రూపం కాదు. క్రూర విలువల మధ్య ఒంటరిగా నలుగుతున్న హృదయం అరుపు"[18] అని విమర్శకులు వివరిస్తారు.

**దిగంబర కవులు :**

అభ్యుదయ కవితోద్యమం తర్వాత కొద్దికాలం దేశాన్ని కదిలించిన మరో కవితా ఉద్యమం దిగంబర కవితోద్యమం. భావకవిత్వం, అభ్యుదయకవిత్వంతో పోల్చినప్పుడు దీనిపై పాశ్చాత్య ప్రభావం తక్కువ. వీరు మన సామాజిక వ్యవస్థ 'కుష్టురోగం' తో బాధపడుతుందని విమర్శించారే గాని దాన్ని సంస్కరించుకునే మార్గాల గురించి తమ కవిత్వంలో పెద్దగా దృష్టి పెట్టలేదు. వీరి కవిత్వం పలు విమర్శలకు గురైనా శ్రీశ్రీలాంటి కవులచేత సమర్థించబడింది.

1960 దశాబ్దం మధ్యకాలంలో దిగంబర కవితోద్యమం పుట్టి తెనుగు కవితారంగాన్ని ఒక ఊపు ఊపింది. అప్పటికి స్తబ్దంగా ఉన్న అభ్యుదయ కవులను మేల్కొల్పడానికి ఈ దిగంబర కవిత్వం షాక్ ట్రీట్మెంట్ లా పనిచేసింది. అయితే తర్వాత ప్రారంభమైన విప్లవ కవితా ఉద్యమానికి, ఈ దిగంబర కవితా ఉద్యమానికి చెప్పుకోదగిన తేడా లేనందువల్ల దిగంబర కవిత విప్లవ కవితా ఉద్యమంలో లీనమై పోయింది.

**నయాగరా కవులు :**

"నయాగరా కవులది (కుందుర్తి ఆంజనేయులు, బెల్లకొండ రామదాసు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం గార్లది) జాప్యాన్ని సహించని ఆవేశం. సమాజం మారాలి దాన్ని మార్చాలి. కాని ఆ మార్పు వెంటనే రావాలి అనుకొనేవాళ్లు వీరు"[19]. ఇటువంటి భావంతో కవులు తర్వాత చాలామంది వచ్చారు. వీరు ప్రధానంగా వచన కవిత్వాన్ని ఆదరించారు. దాని అభివృద్ధి కోసం నరసారావు పేటలో నవ్యసాహిత్య పరిషత్ ను స్థాపించారు. అదేవిధంగా వచనకవిత్వం ఒక ఉద్యమంలా సాగడానికి 'ఫ్రీవర్స్ ఫ్రంట్' ను నెలకొల్పారు.

**కవిసేన :**

రాజకీయ పార్టీకి మాత్రమే పరిమితమై, అభివ్యక్తిని కోల్పోయి నినాదప్రాయ స్థితికి వచ్చిన విప్లవ కవిత్వం మీద తిరుగుబాటుగా 1977లో 'కవిసేన' కవిత్వం ఆవిర్భవించింది. ఈ కవిత్వం మలిదశ

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-2, (April-June), 2025

భావకవిత్వాన్ని పోలి ఉంది. వస్తువులో మార్పు్భావాలు కూడా కొన్ని చోటుచేసుకున్నాయి. కవిసేన కవిత్వానికి నాయకుడు గుంటూరు శేషేంద్రశర్మ.

"ఆధునిక సమాజంలోని వస్తువును వాచ్యంగా కాకుండా కవిత్వీకరించి చెప్పడం కవిసేన కవిత్వ ధ్యేయం"[20] అనేది కవిసేన గురించి విమర్శకుల అభిప్రాయం.

**చేతనావర్త కవులు :**

తాత్త్విక ఆలోచనా ధార ఏదీ అంతగా లేని దిగంబర కవుల సాహిత్య వ్యాసంగంతో ఏర్పడిన గందరగోళ సమయంలో సాహిత్యంపట్ల సదవగాహన పెంచడానికీ, పోయిన విలువల్ని మళ్ళీ ఉద్ధరించడానికి చేతనా వర్త కవుల సంపుటాలు రెండు వెలువడ్డాయి. ఆనాడు పండితులూ పత్రికలూ ఈ కృషిని వేనోళ్ల కొనియాడారు. సాహిత్యం పేరుతో సాగిన ఆరాచకాన్ని ఇది అరికట్టింది. చేతనావర్తం కవులు నలువురు. 1. కోవెల సుప్రసన్నాచార్యులు 2. కోవెల సంపత్కుమారాచార్యులు 3. పేర్వారం జగన్నాథం 4. వేణుముద్దల నరసింహారెడ్డి.

**పైగంబరం కవులు :**

"మా కవిత్వం సమస్యల కీకారణ్యంలో మానవతారథం పథం చూపించే టార్చిలైటు" అంటారు ఈ పైగంబర కవులు. "మేము మానవతా వాదులం. కాని సమస్యా పరిష్కారానికి మానవత, సమరస భావం ఎంత అవసరమో కొన్నివేళల్లో కరకు కత్తిలా వ్యవహరించడం కూడా అంతే అవసరమని నమ్మినవాళ్లం" అని ప్రకటించారు. "ఇలారా... ఇక్కడ నీకోసం మానవత్వపు అగరువత్తులు వెలిగించి ఉంచాను"[21] అంటూ ఈ కవులు కవితాగానాలు చేసి మానవత్వాన్ని ప్రచారం చేస్తూ అవసరమైతే విప్లవానికి వెనుకాడ మంటూ" గానాలు చేశారు. వీరే యం.కె. సుగంబాబు, దేవీప్రియ, ఓల్గా, కిరణ్ బాబు, కమలాకాంత్ లు.

**వచన కవిత్వం :**

ఆధునిక కవితాయుగమంతా వచన కవితాయుగ మనవచ్చు. గేయకవిత్వం, పద్య కవిత్వాలకన్నా వచన కవిత్వాన్ని ఆధునిక యుగంలో కవులు ఆశ్రయించారు.

కవిత ప్రధానంగా ఆత్మాశ్రయరూపం. వచన కవితారూపంలో వ్యవహార భాషను ఉపయోగించి సామాన్యపాఠకులకు కొంత దగ్గర కావచ్చు. శైలి ధ్వన్యాత్మకంగా, అలంకారికంగా ఉంటే ఈ వచన కవిత్వం మరింత ఆకర్షణీయం అవుతుంది. అయితే కొన్నిసార్లు మితిమీరిన వర్ణనలు, అలంకారాలు పాఠకులను

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-2, (April-June), 2025

తికమకపెట్టే అవకాశం లేకపోలేదు. నవల పాఠకుల్ని ఆలోచింపచేస్తే, కవిత సౌందర్యాత్మకంగా స్పందింపచేస్తుంది.

"కుందుర్తికి ప్రజలు కావాలి. కవిత్వం ప్రజలదాకా వెళ్లి ప్రయోజనాన్ని సాధించా లంటే వచన కవిత చాలా గొప్ప వాహిక అనీ, ఆ వచన కవిత ఎంత సులభంగా వుంటే అంతగా ప్రయోజనాన్ని సాధిస్తుందనీ ఆయన దృక్పథం"[22] అని కుందుర్తి గారి హృదయాన్ని వర్ణిస్తారు విమర్శకులు.

తెలుగు కవిత్వంలో 20వ శతాబ్దం ప్రయోగాల యుగం. గురజాడ నుండి 20వ శతాబ్ది వరకు రకరకాల ప్రయోగాలు జరుగుతూనే ఉన్నాయి. వీటిలో ప్రధానమైన మార్పు సంప్రదాయ సిద్ధమైన ఛందస్సులను వదిలివేయటం తత్ఫలితంగా తెలుగు కవిత్వంలో 'ఫ్రీవర్స్' అనే ఈ కొత్తపద్ధతి రూపొందింది. కుందుర్తి ఆధ్వర్యంలో 'ఫ్రీవర్స్' కవి మిత్రులందరు కలిసి 1966లో 'ఫ్రీవర్స్ ఫ్రంట్' అనే సంస్థగా స్థాపించారు. ఈ సంస్థ 1982 వరకు 'ఫ్రీవర్స్' కవిత్వాన్ని బాగా ప్రోత్సహించి ఫ్రీవర్స్ కవితా సంపుటాలకు బహుమతులను కూడా అందజేసింది.

**మినీ కవిత్వం :**

1980 తర్వాత విప్లవోద్యమ ప్రభావ తీవ్రత తగ్గిపోయిన తర్వాత కవులు అనేక వర్గాలుగా విడిపోయారు. వీటిలో ముఖ్యంగా నాలుగు వర్గాలు ఆ తర్వాత కాలంలో కూడా ప్రభావితంగా ఉన్నాయి. "కొందరు కవులు అనుభూతివాదాన్ని స్వీకరించారు. మరికొందరు సామాజిక ప్రగతిని గూర్చి వ్రాస్తున్నారు. కొందరు మార్క్సిస్టు పునాదితో సామాజిక చైతన్యం సృష్టించేవారున్నారు. ఇంకా కొందరు ఎక్కువగా 'మినీ కవితలు' వ్రాస్తున్నారు. దాదాపు మినీ కవితలన్నీ సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి"[23] అంటూ విమర్శకులు కవులను వర్గీకరించడం జరిగింది. ఇందులోని ఒక వర్గంవారే మినీ కవితలు సృష్టించారు.

**జన నాట్యమండలి :**

సుబ్బారావు పాణిగ్రాహి, శివసాగర్ (కె.జి.సత్యమూర్తి) ప్రారంభించిన విప్లవ గీతాలాపనతో ప్రేరణ పొంది 1973లో ఏర్పడిన 'జననాట్యమండలి' చెరబండరాజు, గద్దర్, వంగపండు ప్రసాద్, జి. అంజయ్య మొదలైన అనేకమంది విప్లవ కవుల్ని ప్రభావితం చేసింది. బలమైన విప్లవ గీతాలను పలికించింది.

"రంగనాయకమ్మగారి నేతృత్వంలో ఒక యువక బృందం 'ప్రజా సాహితి' సంస్థను ఏర్పాటు చేసింది. 1985 అక్టోబరులో 'విరసం' నుండి విముక్తమైన మంచి రయితల బృందం 'ప్రజారచయితల సమాఖ్య' ను

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-2, (April-June), 2025

ఏర్పాటుచేసింది. 'జనసాహితి' అనే మరో విప్లవకారుల సాహిత్య సంస్థకూడా తన సొంత కార్యక్రమాలు కొనసాగిస్తోంది"[24] అంటూ వివిధ విప్లవ రచయితల బృందాల గురించి వివరిస్తారు యస్వీ సత్యనారాయణ.

**ఆంధ్ర ప్రజానాట్యమండలి :**

1943 జూన్ మాసంలో విజయవాడలో ఒక వైజ్ఞానిక శిక్షణాశిబిరం జరిగింది. ఇది కొంతమంది కళాకారులను తయారు చేసింది. ఇక్కడ జరిగిన శిబిరంలో సమీకృతమైన కళాకారులతో 'ఆంధ్ర ప్రజానాట్యమండలి' ఏర్పడింది. హిట్లర్ ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రపంచయుద్ధాన్ని, చాకిరి, భూస్వాముల దోపిడి, పరాయి పాలకుల అరాచకాలు వంటివాటిని ఖండిస్తూ సమసమాజ నిర్మాణం, ప్రపంచశాంతి పరిక్షణ, జాతీయ స్వాతంత్ర్యం వంటి అంశాలను ప్రచారం చేస్తూ 'ప్రజానాట్యమండలి' విస్తరించింది.

**మహిళా సమాజాలు :**

స్త్రీల సమస్యల గురించి చర్చించి స్త్రీల పురోభివృద్ధికై, స్త్రీకి సమాజంలో పురుషులతో సమానమైన హక్కుల సాధనకై స్త్రీకి జరిగే అన్యాయాలను బయట పెట్టడానికి ఎన్నో మహిళా సంఘాలు, మితవాద, అతివాద స్త్రీవాద సంఘాలు బయలుదేరి సాహితీపరంగా, సాహిత్యేతరంగా సేవలు చేస్తున్నాయి.

స్వాతంత్ర్యం రాకపూర్వం దేశ ప్రజల్లో ఉన్న వితరణ భావం, స్వార్థ త్యాగం, సహిష్ణుత, జాతీయాభిమానం స్వాతంత్ర్యానంతరం క్రమంగా ప్రజలలో తగ్గినట్లు కనిపిస్తుంది."పరిపాలకులే జాతికి దుర్బుద్ధులు నేర్పారు. కలహ శీలతను ప్రేరేపించారు. తాము పదవులలో భద్రంగా ఉండడానికి అనేకమైన కపటాలను ఆశ్రయించారు. వర్గ, వర్ణ, ప్రాంత, మత, భాషా విభేదాలను ప్రోదిచేశారు. ఎన్నికలలో విచ్చలవిడిగా ధనవ్యయం చేయవలసిన పరిస్థితులు సృష్టించి అందుకోసం ధనార్జనకై అవినీతి పద్ధతులు ఆశ్రయించారు"[25] అంటూ రాజకీయ నాయకుల గురించి వివరిస్తారు విమర్శకులు.

స్వాతంత్ర్యానంతరం తెలుగు కవిత్వంలో జరిగిన ప్రధానమైన మార్పులు సామ్యవాద భావాలతో కూడిన అభ్యుదయ కవితా విజృంభణ, వచన కవితావిర్భావం, దిగంబర విప్లవ కవితా ఉద్యమాలు అని చెప్పవచ్చు.

స్థూలంగా చెప్పాల్సొస్తే "ప్రాచీన కవిత్వం చాలామటుకు ఆధ్యాత్మిక తత్వం, దేవుడు, వీటితో కూడుకున్నది. అప్పుడు రచయితలకీ, పాఠకులకీ ఒక్కటేభావం. ఆధ్యాత్మిక తత్వం. కావ్య ప్రయోజనం యేమిటి అంటే 'మోక్షపర నిర్వృతి' వ్యక్తి ముముక్షువై బ్రహ్మానందం పొందడం, బ్రహ్మ ప్రచారం వాళ్లకి ముఖ్యం.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-2, (April-June), 2025

ఇప్పుడు సామాజిక విలువలు మారిపోయాయి. 'మార్క్సిస్టు' దృక్పథంతో చూసినప్పుడు ప్రాచీన కావ్యాలు బలహీన వర్గాల వారిని పీడించే దోపిడీ వర్గాన్ని సమర్థించే అభిప్రాయాలని ప్రచారం చేసేవిగా అనిపిస్తాయి"[26] అంటారు కుందుర్తి.

కాబట్టి నేటి ఆధునిక సాహిత్యం సమసమాజ నిర్మాణంవైపే ప్రయాణిస్తూ ఉంది. దీనికి సంస్కరణ మార్గాలను అనుసరించక తప్పదు. దీనిని చాలమంది ఆధునిక కవులు అనుసరిస్తూనే ఉన్నారు.

**ముగింపు :**

1. ఆధునికకవిత్వం ప్రాచీన కవిత్వపు పునాదులపై ఆవిర్భవించిన ప్రక్రియ కాదు. ఇది పూర్తిగా నూతన ప్రక్రియ. ఇది పాశ్చాత్య సాహిత్య ప్రభావం వలన తెలుగు సాహిత్యంలోకి వచ్చింది.
2. అనేక సెలయేర్లు కలిసి నదిగా ఏర్పడినట్లు, ఈ ఆధునికకవిత్వం కూడా అనేక పాత, కొత్త ప్రక్రియలు సమ్మేళనం.
3. ధనికులు, పాలకుల సహకారం లేకుండ సామాన్య ప్రజలు, సాహిత్య సంఘాల సహకారంతో ఆధునిక కవిత్వం వికసించింది.
4. సామాన్య ప్రజల కోసం, వారి భాషలో వెలువడిన ఈ ఆధునిక కవిత్వం యొక్క లక్ష్యం సామాజిక సంస్కరణ.
5. ఈ ఆధునిక కవిత్వం ఆవిర్భవించినప్పటి నుండి ఇప్పటి వరకు అనేక సామాజిక రుగ్మతలను రూపుమాపడంలోనూ, మన సమాజంలోని అన్యాయాలు, దుర్మార్గాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పర్చడంలోనూ, సంఘటితం చేయడంలోనూ కీలకపాత్ర వహించింది.

**పాదసూచికలు :**

1. కుందుర్తి వచన కవిత, పుట 14
2. భారతి మాసపత్రిక, నవంబర్ 1952, పుట 6
3. ఆధునికాంధ్ర కవిత్వము-సంప్రదాయముల ప్రయోగములు,పుట 319
4. తెలుగు సాహిత్యం – ముస్లిం సేవ, పుట 225
5. శ్రీశ్రీ ఉపన్యాసాలు, పుట 288
6. ఆధునికాంధ్ర గేయకవిత్వం, పుట 15 (పీఠిక)

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-2, (April-June), 2025

7. ఇదే, పుట 3 (పీఠిక)
8. శ్రీ శ్రీ - ప్రజ, పుట 170
9. ఇదే, పుట 170
10. కుందుర్తి వ్యాసాలు, పుట 132
11. ఆధునిక స్త్రీ , పుట 8
12. నూరేండ్ల సాహిత్యంలో కొన్ని ధోరణులు – దృక్పథాలు, పుట 2
13. కుందుర్తి వ్యాసాలు, పుట 15
14. తెలుగులో జాతీయోద్యమ కవిత్వం, పుట 187
15. ఆధునిక తెలుగు కవిత్వంలో మానవతావాదం – విభిన్న ధోరణులు, పుట 5
16. గోపాల చక్రవర్తి కవితలు, పుట 27
17. వాస్తవికత – అధివాస్తవికత, పుట 254
18. ఇదే, పుట 255
19. నూరేండ్ల సాహిత్యంలో కొన్ని ధోరణులు – దృక్పథాలు, పుట 43
20. అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు, పుట 73
21. ఇదే, పుట 224
22. ఇదే, పుట 136
23. ఇదే, పుట 143
24. తెలుగులో ఉద్యమ గీతాలు, పుట 331
25. అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు, పుట 153
26. కుందుర్తి వ్యాసాలు, పుట 80

**ఉపయుక్తగ్రంథాలు :**

1. జగనాథం పేర్వారం.(1987).అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు, సాహితీబంధు బృందం, వరంగల్లు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-2, (April-June), 2025

2. నారాయణరెడ్డి సింగిరెడ్డి.(1967).ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయము, ప్రయోగములు, ఆం.ప్ర.బుక్ డిస్ట్రిబ్యూటర్స్, మచిలీపట్టణం.
3. చెన్నకేశవరెడ్డి జి.(1988).ఆధునికాంధ్ర గేయ కవిత్వం, జయమిత్ర పబ్లికేషన్స్, హైదరాబాద్.
4. అరుణకుమారి జి.(1992).ఆదునికాంధ్ర కవిత్వంలో మానవతావాదం – విభిన్న ధోరణులు, ఈస్ట్ వెస్ట్ రీసర్చ్ సెంటర్, హైదరాబాద్.
5. సిధారెడ్డి నందిని.(1989).ఆధునిక తెలుగు కవిత్వం వాస్తవికత- అధివాస్తవికత, తెలుగు పరిశోధన ప్రచురణలు, హైదరాబాద్.
6. సుబ్బమ్మ మల్లాది.(1981).ఆధునిక స్త్రీ, మల్లాది పబ్లికేషన్స్, హైదరాబాద్.
7. ఆంజనేయులు కుందుర్తి.(1990).కుందుర్తి వ్యాసాలు, తెలుగు పరిశోధన ప్రచురణలు, హైదరాబాద్.
8. గోపాలచక్రవర్తి.(1980).గోపాలచక్రవర్తి కవితలు,గోపాలచక్రవర్తి షష్ఠి పూర్తి సన్మాన సంఘం, హైదరాబాద్.
9. సుబ్బారెడ్డి మద్దూరి.(1982).తెలుగులో జాతీయోద్యమ కవిత్వం, రాగసుధా ప్రచురణలు, తిరుపతి.
10. మస్తాన్ షేక్, అబ్దుల్ సత్తార్.(1991).తెలుగు సాహిత్యం – ముస్లింల సేవ, కరీమా పబ్లికేషన్స్, గుంటూరు.
11. మందేశ్వరరావు వడలి.(1991).నూరేండ్ల సాహిత్యంలో కొన్ని ధోరణులు దృక్పథాలు, సమదర్శిని సాహిత్య సమాఖ్య, హైదరాబాద్.
12. వేంకటేశ్వర్లు జి.(1974).కుందుర్తి వచన కవిత, జయమిత్ర పబ్లికేషన్స్, హైదరాబాద్.
13. శ్రీశ్రీ – ప్రజ.(1990). శ్రీశ్రీ సాహిత్య సర్వస్వం 19, విరసం ప్రచురణ, హైదరాబాద్.
14. గోపాలకృష్ణమూర్తి శ్రీపాద. (నవంబర్, 1952).గురజాడ-రాయప్రోలు, భారతి మాసపత్రిక.
15. సత్యనారాయణ ఎస్వీ.(1996).తెలుగులో ఉద్యమగీతాలు, తెలుగు అకాడమీ ప్రచురణ, హైదరాబాద్.